కాంగ్రెస్ చెప్పేవన్నీ అబద్ధాలే

- అభివృద్ధి పనులన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగినవే
- రిబ్బన్లు కట్‌చేసి ప్రారంభోత్సవాలు చేయడమే మీరు చేస్తున్న అభివృద్ధా..
- రేవంత్ సర్కార్‌పై మండిపడ్డ బీఆర్ఎస్ నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

చేవెళ్ల రూరల్, జనవరి 9 : సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెద్దొళ్ల ప్రభాకర్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, కనీస వేతన సలహామండలి రాష్ట్ర మాజీ చైర్మన్ పి.నారాయణ అన్నారు. గురువారం చేవెళ్ల మండల పరిధిలోని కేసారం గ్రామ రెవెన్యూలో ఉన్న బృందావనం కాలనీలో వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టినవేనని అన్నారు. కాంగ్రెస్ నేతలు వచ్చి రిబ్బన్లు కట్‌చేసి ప్రారంభోత్సవాలు చేయడం విడ్డూరంగా ఉన్నదని ఎద్దేవా చేశారు. అభివృద్ధి పనులు అంటే మా హయాంలో చేసినవి మీరు ఓపెన్ చేయడమేనా అని ప్రశ్నించారు.

రూ.34 కోట్ల బీటీ రోడ్డు నిధులు..

హైదరాబాద్-బీజాపూర్ హైవే ముడిమ్యాల్ గేట్ నుంచి రావులపల్లి, మేడిపల్లి వరకు రూ.34 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఈనెల 8న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శంకుస్థాపన చేసిన రోడ్డుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జీవో జారీ అయిందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. అప్పుడు రూ.34 కోట్లు, ఇప్పుడు సంఖ్యలో ఏం మార్పు జరుగలేదని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నదని.. ఇది మంచి పద్ధతి కాదన్నారు.

తెలంగాణ తొలి సీఎంపై అనుచిత వ్యాఖ్యలు తగవు..

తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. పదేండ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలకు చూపుతూ మేం చేస్తున్నామని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. వికారాబాద్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మీరు అప్పా నుంచి మన్నెగూడ వరకు హైవే నిర్మాణానికి ఎందుకు చొరవ తీసుకోవడం లేదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గానికి వెళ్లాలంటే ఈ రోడ్డు గుండా వెళ్తారని, పనులు ప్రారంభం కాకపోవడం కాంగ్రెస్ అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అనేక పరిశ్రమలు..

షాబాద్, చందనవెల్లిలో అనేక పరిశ్రమల ఏర్పాటు, శంకర్‌పల్లిలో రైల్వే కోచ్ ఏర్పాటు వంటి పనులు బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే జరిగాయని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రైతు బంధు, రైతు బీమా, తులం బంగారం, రూ.లక్ష ఇస్తామని హామీలు గుప్పించినా.. వాటి ఊసే లేదన్నారు. అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెపుతామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు విఘ్నేశ్ గౌడ్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు తోట శేఖర్, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బ్యాగరి నర్సింహులు, బీఆర్ఎస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు అబ్దుల్ ఘని, దేవరంపల్లి, ఖానాపూర్ మాజీ సర్పంచ్‌లు నరహరిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎల్లన్న, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి
- విద్యార్థులకు దుప్పట్లు, నోటుబుక్స్ పంపిణీ

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి, జనవరి 9 (నమస్తేతెలంగాణ) : ప్రతీ విద్యార్థి లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధన దిశగా కష్టపడి చదవాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని కోహెడలోని షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహంలో విద్యార్థులకు దుప్పట్లు, నోటు పుస్తకాల పంపిణీకి ఆర్థికంగా సహకరించినందుకు ఇబ్రహీంపట్నం డివిజన్ రెవెన్యూ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ వసతి గృహాల్లో చదివిన ఎందరో మేధావులు, రాజకీయ వేత్తలు, అధికారులు ఉన్నత స్థాయిలకు ఎదిగారని గుర్తు చేశారు. విద్యార్థులు వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో చదువు కోవడానికి వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలని విద్యార్థులకు తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. వారి వారి లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. చదువుతున్న ప్రతీ విద్యార్థి కష్టపడాలన్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పదికి పది శాతం గ్రేడ్ పాయింట్లు సాధించాలన్నారు. విద్యార్థులకు అందిస్తున్న డైట్ చార్జి స్ మార్పులపై మాట్లాడుతూ... వారికి అందుతున్న డైట్ మెనూ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ సునీతారెడ్డి, మంచాల తహసీల్దార్ ప్రసాద్ రావు, వసతి గృహం ప్రత్యేక అధికారి, డీఎల్ పీవో సాధన, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ అధికారి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై అధికారుల దాడులు

ఎస్పీ నారాయణ రెడ్డి

పేకాట రాయుళ్లను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

వికారాబాద్, జనవరి 9 : పేకాట స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ జిల్లా అధికారులు దాడులు చేశారని ఎస్పీ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో జిల్లాలోని నవాబుపేట, బషీరాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న పేకాట స్థావరాలపై అధికారులు దాడులు నిర్వహించారన్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు పేకాట స్థావరాలపై దాడులు చేసి, కేసులు నమోదు చేసి 25 మందిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. రూ.3,81,830 నగదు, 27 సెల్ ఫోన్లను సీజ్ చేసినట్లు తెలిపారు. నవాబుపేట పరిధిలోని గంగ్యాడ శివారులో ఉన్న మ ల్లేశం ఫామ్‌హౌస్‌లో పేకాట అడుతున్న 20 మందిని అదుపులోకి తీసుకొని, వా రి నుంచి రూ.3,26,510 నగదు, 22సెల్ ఫోన్లు, 5 కార్లు, 6 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారన్నారు. నవాబుపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారని తెలిపారు. బషీరాబాద్ పీఎస్ పరిధిలోని నవాల్గ గ్రామంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారని తెలిపారు. పేకాట ఆడుతున్న ఐదు గురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.55,320 నగదు, 5 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొన్నారని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా పేకాట ఆడిన, ఇసుక, పీడీఎస్ రైస్‌ను అక్రమంగా రవాణా చేసినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే జిల్లా టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు సెల్ 8712670022 నంబర్ ద్వారా సంప్రదించాలన్నారు.

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు తప్పవు

ఆమనగల్లు కిరాణా దుకాణంలో తనిఖీ చేస్తున్న డీఆర్‌వో జగన్‌మోహన్

ఆమనగల్లు, జనవరి 9 : ప్రమాదకరమైన చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డీఆర్‌వో జగన్‌మోహన్ హెచ్చరించారు. చైనా మాంజాతో మనుషులతో పాటు పక్షులకు ప్రమాదం పొంచి ఉన్నదని పేర్కొన్నారు. ఆమనగల్లు లో గురువారం కిరాణా షాపులు, పతంగుల దుకాణాలను ఫారెస్టు సిబ్బందితో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన చైనా మాంజాపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం చైనా మాంజా వినియోగాన్ని నిషేధించారని తెలిపారు. నైలాన్, సింథటిక్ దారాలు పక్షులు, పర్యావరణానికి మనుషులకు హానీ చేస్తాయని వివరించారు. చైనా మాంజా విక్రయాల నిరోధానికి, మాంజా వినియోగాన్ని నిలిపివేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఎక్కడైనా ఈ మాంజాను విక్రయిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో సెక్షన్ అఫీసర్ ఎండీ అన్వర్ హుస్సేన్, ఆమనగల్లు బీట్ ఆఫీసర్ రాఘవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం పెరగాలి

ఇంటర్మీడియెట్ వికారాబాద్ జిల్లా విద్యాధికారి శంకర్

పరిగి, జనవరి 9 : ఇంటర్మీడియెట్‌లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరగాలని ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాధికారి శంకర్ ఆదేశించారు. గురువారం పరిగిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల (గిరిజన)లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులతో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఈసారి ఇంటర్మీడియెట్‌లో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని గణనీయంగా పెంచాలని సూచించారు. విద్యార్థులకు పర్యావరణ విద్య, ఆంగ్లం ప్రాక్టికల్స్, సైన్స్ సబ్జెక్టుల వారీగా ప్రాక్టికల్స్ నిర్వహించాలని ఆయన సూచించారు. విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధులను చేయాలన్నారు. 20 రోజులు.. ఒక ప్రత్యేకమైన ప్రణాళికలో భాగంగా విద్యార్థులను సంసిద్ధం చేయాలన్నారు. పరీక్షలనే భయాన్ని విద్యార్థుల మనసులో నుంచి తొలగించాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు, కుమారస్వామి, థామస్‌రెడ్డి, ఉమా సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాధికారి శంకర్

పశువుల సమగ్ర సమాచారం సేకరించాలి

హిమాయత్‌నగర్‌లో పశుగణను పరిశీలిస్తున్న కేంద్ర పశుసంవర్ధక శాఖ కమిషనర్ డాక్టర్ విజయ్‌కుమార్ తివాటియా

మొయినాబాద్, జనవరి 9 : పశువులకు సంబంధించి పూర్తి సమాచారం సేకరించాలని కేంద్ర పశు సంవర్ధక శాఖ కమిషనర్ డాక్టర్ విజయ్ కుమార్ తివాటియా అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో కొనసాగుతున్న 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. పశుగణన ఎలా చేస్తున్నారు.. ప్రతీ ఇంటికి వెళ్లి పశువుల లెక్కలు సేకరిస్తున్నారా అని అధికారులను అడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశు గణన పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. పశువుల లెక్కల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం పథకలను రూపొందించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. పశుగణన వేగవంతం చేయాలని నిర్దేశించిన గడువులోపు పశు గణన పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర అధికారి డాక్టర్ షకీల్ అహ్మద్, మండల పశు వైద్యాధికారులు మోహన్‌రెడ్డి, అహ్మద్ ఉన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాలి

మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య

రవీంద్రభారతి,జనవరి9: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలను మరోమారు మోసం చేయకుండా 42 శాతం రిజర్వేషన్లపై చట్టం చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని లేదంటే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని బీసీ సంక్షమే సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జల్లపల్లి అంజి అధ్యక్షతన 20 బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచడానికి ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతం పెంచుతూ అసెంబ్లీలో బిల్లు పెట్టి పాస్‌చేయాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం డెడికేటెడ్ కమిషన్ సిఫార్సు చేసి అసెంబ్లీ చట్టం చేస్తే చట్టపరమైన న్యాయపరమైన అవరోధాలు ఉండవన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం సర్పంచ్, ఎంపీటీసీ,జడ్పీటీసీ, వార్డు మెంబర్లలో 42 శాతం రిజర్వేషన్లు పెంచకపోతే యుద్ధం జరుగుతుందని హెచ్చరించారు. ఫిబ్రవరి నెలాఖరుకు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తామని సీఎం ప్రకటించారని, ఇచ్చిన హామీ ప్రకారం చట్టాన్ని తీసుకువచ్చి ఎన్నికలను నిర్వహించాలని, లేదంటే బీసీల ఆగ్రహానికి గురికాకతప్పదన్నారు. అసవరమైతే రాష్ట్రంలోని అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు,కులసంఘాలు,మేధావులతో కలిసి గుజ్జర్ల తరహాలో ఐక్యపోరాటాలకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, నిమ్మల వీరన్న, మోదీ రామ్‌దేవ్,మల్లేష్, పి.సతీష్

ఎకరాకు రూ.2కోట్లు ఇవ్వాలి

రైతులతో సమావేశమైన ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు, జనవరి 9 : మండల పరిధిలోని బేగరికంచె సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫోర్త్ సిటీ రోడ్డుకు భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ. 2 కోట్లు ఇవ్వాలని లేదంటే నష్టపరిహారంతో పాటు ఎకరాకు పుల్లింగ్ ద్వారా 1750 గజాలు, ఉద్యోగం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. గురువారం ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డితో పాటు భూసేకరణ ఆర్డీవో రాజు లేమూరు రైతులతో సమావేశమయ్యారు. భూములు కోల్పోతున్న లేమూరు రైతులకు ఎకరాకు రూ. 90లక్షలు,రాచలూరు రైతులకు రూ. 60లక్షలు, తిమ్మాపూరు రైతులకు ఎకరాకు రూ. 70 లక్షల నష్టపరిహారం చెల్లిస్తామని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలుపగా రైతులు ఒప్పుకోలేదు. మాజీ సర్పంచ్ గణేశ్ ముదిరాజ్, లిక్కి జంగారెడ్డి, ఎలుక సంజీవరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఇక నుంచి పోలీసు సేవలపై ఫీడ్‌బ్యాక్

సిటీబ్యూరో, జనవరి 9 (నమస్తే తెలంగాణ): పోలీసులు అందిస్తున్న సేవలు ప్రజల్లోకి సక్రమంగా వెళ్తున్నాయా లేదా, పోలీసు సేవలపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారా లేదా తదితర అంశాలను తెలుసుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు సేవలపై ప్రజాభిప్రాయం సేకరించేందుకు తెలంగాణ పోలీసు శాఖ తిరిగి శ్రీకారం చుట్టింది. బీఆర్ఎస్ హయాంలోనే ఫీడ్‌బ్యాక్ సెంటర్లు పనిచేశాయి. పోలీసు సేవలపై ఎప్పటికప్పుడు ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటూ పోలీసు సేవలను సంస్కరిస్తూ దేశంలోనే తెలంగాణ పోలీసును బెస్ట్ పోలీస్ అని నిరూపించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఫీడ్‌బ్యాక్ సెంటర్లు అటకెక్కాయి. దీంతో పోలీసు శాఖలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయనే ఆరోపణలు రావడం, నేరాలు సైతం పెరగడంతో కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి పాత విధానానికే జై కొట్టింది. ఇందులో భాగంగానే గురువారం డీజీపీ జితేందర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు..

పోలీసు సేవలపై ప్రజలు నిర్భయంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తపర్చవచ్చు. అందుకోసం పోలీసు శాఖ కొత్తగా క్యూఆర్ కోడ్ ఆధారిత ఫీడ్‌బ్యాక్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రజలు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు పోలీస్ స్టేషన్‌ల వివరాలు, ఇతర పోలీసు కార్యాలయాలు వంటివి డిస్‌ప్లే అవుతాయి. అంతేకాకుండా సిటిజన్ ఫీడ్‌బ్యాక్ కాల్ సెంటర్ ద్వారా కూడా నేరుగా ప్రజలు పోలీసు సేవలపై తమ అభిప్రాయాన్ని తెలియపర్చవచ్చు.

వీటిపైన అభిప్రాయాలు తెలియచేయవచ్చు:

పిటిషన్ సమర్పించడం
ఎఫ్ఐఆర్ నమోదు అంశంలో
ఎఫ్ఐఆర్ రిజిస్ట్రేషన్
ట్రాఫిక్ ఈ-చలాన్స్
పాస్‌పోర్ట్ వెరిఫికేషన్
ఇతర అన్ని రకాల పోలీసు సేవలు

రాబోయే ఎన్నికల్లో బీసీనే ముఖ్యమంత్రి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జైహింద్ గౌడ్, చెన్నరాములు ముదిరాజ్, శ్రీశైలం ముదిరాజ్

ఖైరతాబాద్, జనవరి 9 : రాబోయే ఎన్నికల్లో బీసీనే ముఖ్యమంత్రి చేసుకోవాలని నవ సంఘర్షణ సమితి జాతీయ అధ్యక్షుడు పంజాల జైహింద్ గౌడ్ పిలుపునిచ్చారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం వెనుకబడిన కులాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నాగనమోని చెన్న రాములు ముదిరాజ్ అధ్యక్షతన తెలంగాణలో రాజ్యాధికారమే లక్ష్యంగా రాష్ట్ర స్థాయి బీసీ నేత చర్చా వేదిక జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జైహింద్ గౌడ్ మాట్లాడుతూ దేశ జనాభాలో 60 శాతం బీసీలు ఉన్నా పదవులు మాత్రం అగ్రవర్ణాలు అనుభవిస్తున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలో రేవంత్ చివరి అగ్రవర్ణ సీఎంగా మిగిలిపోతారని, వచ్చే ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించుకొని ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. అనంతరం ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విశ్రాంత కానిస్టేబుల్ శ్రీశైలం ముదిరాజ్‌ను బీసీలందరూ మద్దతుగా నిలిచి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు డాక్టర్ శివ ముదిరాజ్, ఉడుత మల్లేశం, బత్తుల సిద్దేశ్వర్, మహేశ్ గౌడ్, కొండా లలితా బాయి, మమతా గౌడ్, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటిని తాగునీటిగా మారుస్తా

ప్రెస్‌క్లబ్‌లో డెమో ప్రదర్శన ఇస్తున్న ప్రొఫెసర్ వెంకటేశ్వర్

ఖైరతాబాద్, జనవరి 9 : 'ఎంతటి మురుగునీటినైనా స్వచ్ఛమైన తాగునీరుగా మార్చవచ్చు.. ప్రస్తుతం ఉన్న ఎస్టీపీలు అంతగా శుద్ధి చేయవు...కానీ తాను పరిశోధన చేసి కనిపెట్టిన పద్ధతిలో వంద శాతం నీటిని తాగునీటి యోగ్యంగా మార్చవచ్చు' అని ఓయూ ప్రొఫెసర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నీటి శుద్ధిపై డెమో ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం మూసీని ప్రక్షాళన చేస్తామని, అందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని, కాని అతి తక్కువ ఖర్చుతోనే నీటిని శుద్ధి చేయవచ్చన్నారు. వంద ఎంఎల్‌డీ నీరు ప్రవహించే బల్కాపూర్ నాలాను సీవీఆర్ పద్ధతిలో ఐదు నుంచి పది నిమిషాల వ్యవధిలో శుద్ధి చేయవచ్చన్నారు. 5 నుంచి 8 పైసలకు ఒక లీటరు నీటిని శుభ్రం చేయవచ్చని, ప్రభుత్వం తగిన సహకారం అందిస్తే మూసీ నది, హుస్సేన్‌సాగర్‌లను శుద్ధి చేస్తానన్నారు. ఆయన వెంట మాజీ మైనార్టీ కమిషన్ సభ్యులు సాల్మన్‌రాజు, అర్వింద్ కుమార్ ఉన్నారు.

నేటి నుంచి నూనె గింజల ఉత్పత్తిపై సదస్సు

సిటీబ్యూరో, జనవరి 9(నమస్తే తెలంగాణ) : నూనెగింజల ఉత్పత్తి, నూనెల తయారీ విధానంలో అందుబాటులో ఉన్న అధునాతన టెక్నాలజీపై అవగాహన కల్పించేలా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో రెండు రోజుల జాతీయ సదస్సు జరగనుంది. నేడు ప్రారంభమయ్యే యాన్యువల్ కన్వెన్షన్ ఆఫ్ ఆయిల్ టెక్నాలజిస్ట్స్ అసోసియేషన్ ఇండియా సదస్సులో నూనె ఉత్పత్తులకు అవసరమైన అధునాతన టెక్నాలజీపై జాతీయ స్థాయిలో పలు సంస్థలకు చెందిన నిపుణులు పాల్గొనున్నారు.

చర్లపల్లి రైల్వే టర్మినల్ నుంచి బస్సుల రాకపోకలు

సిటీబ్యూరో, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : చర్లపల్లి రైల్వే ఆపరేషన్స్‌లో భాగంగా ఆర్టీసీ అధికారులు బస్సు రాకపోకలను అందుబాటులోకి తీసుకొచ్చారు. సికింద్రాబాద్ బ్లూ సీ హోటల్ నుంచి చర్లపల్లి రైల్వే టర్మినల్ ఫ్లాట్ ఫాం 1 వరకు ఉదయం 4.30గంటల నుంచి రాత్రి 10.30 వరకు బస్సులు రాకపోకలు సాగిస్తాయని తెలిపారు. ప్రతి పది నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందని, హబ్సిగూడ, నాచారం మీదుగా బస్సులు వెళుతాయని తెలిపారు. చర్లపల్లి రైల్వే టర్మినల్ నుంచి చంగిచర్ల, ఉప్పల్, రామంతాపూర్ మీదుగా బోరబండ వరకు 40 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఆక్జెన్ యాప్‌తో కరెంట్ అకౌంట్

యాప్‌ను రూపొందించిన ఉమా సూర్య శ్రీనివాస్

కొండాపూర్, జనవరి 9 : చిన్న, మధ్య తరగతి వ్యాపారులకు రెండు నిమిషాల్లోనే కరెంట్ అకౌంట్‌ను పొందేలా బీటెక్ విద్యార్థి రూపొందించిన ఆక్జెన్ యాప్ ఉపయోగకరంగా మారనుంది. మల్లారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్ఆర్ఐటీ)లో బీటెక్ రెండో సంవత్సరం విద్యార్థి ఉమా సూర్య శ్రీనివాస్ తమ బృందంతో కలిసి యాప్‌ను తయారు చేశాడు. తమ పాన్ కార్డు వివరాలతో పాటు తాము కొనసాగిస్తున్న వ్యాపార స్టోర్‌ల ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేసిన వెంటనే వివరాలను వెరిఫై చేసి, అర్హులైన వారికి వెంటనే కరెంట్ ఖాతాను పొందేలా చేస్తుందన్నారు. యాప్‌ను అతి త్వరలోనే లాంచ్ చేసి, ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.

జన్యుశాస్త్రంపై అవగాహన ఉండాలి

ఖైరతాబాద్, జనవరి 9 : హైటెక్స్‌లో జరుగుతున్న 62వ పెడికాన్ జాతీయ సదస్సులో భాగంగా నిమ్స్ మెడికల్ జెనెటిక్స్, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ సంయుక్తాధ్వర్యంలో క్లినికల్ జెనెటిక్స్‌పై ప్రీ కాన్ఫరెన్స్ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశారు. ఈవర్క్ షాప్‌ను నిమ్స్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ లీజా రాజశేఖర్, మెడికల్ జెనెటిక్స్ విభాగం ప్రొఫెసర్, ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రజ్ఞ రంగనాథ్, డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్ విభాగాధిపతి డాక్టర్ అశ్విన్ దలాల్‌తో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతి వైద్యుడికి జన్యుశాస్త్రంపై అవగాహన ఉండాలని, తద్వారా పిల్లలు, పెద్దల్లో వచ్చే రోగ నిర్ధారణ, వైద్య చికిత్సలకు ఎంతో దోహదపడుతుందన్నారు.

ప్రీ కాన్ఫరెన్స్ వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, డాక్టర్ ప్రజ్ఞ రంగనాథ్